7

సాక్షి అనంతపురం

శనివారం । 8 । జూలై । 2023



6 ఇసుక రీచ్‌లకు అనుమతులు

జిల్లాలో తిమ్మలాపురం, అజ్జయ్యదొడ్డి, పామిడి, చిలమకూరు, ఇల్లూరు,కర్తనపర్తి ఇసుక రీచ్‌లకు అనుమతులు మంజూరు చేసినట్లు గనులశాఖ డీడీ వెంకటేశ్వర్లు తెలిపారు.



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/ 22.3°



- కళ్యాణదుర్గం వేదికగా రైతు దినోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఇక్కడి నుంచే వైఎస్సార్ ఉచిత పంటల బీమా సొమ్ము విడుదల
- రాష్ట్రంలోని 10.2 లక్షల మంది రైతులకు రూ.1,117.21 కోట్ల లబ్ధి



నేడు సీఎం రాక

కళ్యాణదుర్గం/ కళ్యాణదుర్గం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. కళ్యాణదుర్గంలో శనివారం వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రైతు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. అక్కడి నుంచే ఖరీఫ్–2022లో రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి 10.20 లక్షల మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.1,117.21 కోట్ల పరిహారం వారి బ్యాంకు ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని సీఎం బటన్ నొక్కి ప్రారంభిస్తారని కలెక్టర్ గౌతమి మీడియాకు వెల్లడించారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 2,65,114 మంది రైతులకు రూ.370.58 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. కాగా.. సీఎం ఉమ్మడి జిల్లాలో పర్యటించడం ఇది ఆరోసారి.


కళ్యాణదుర్గంలో సీఎం జగన్‌కు స్వాగత ఫ్లెక్సీలు

సీఎం పర్యటన సాగుతుందిలా...

- ఉదయం 8.30 గంటలకు సీఎం జగన్ గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి బయల్దేరి 9.15 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
- 9.30 గంటలకు పుట్టపర్తి ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 9.50 గంటలకు కళ్యాణదుర్గం హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.50 నుంచి 10 గంటల వరకు హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో పరిచయం.
- 10 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వద్దకు చేరుకుంటారు.
- 10.10 నుంచి 10.25 గంటల వరకు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్ శిలాఫలాకాన్ని ప్రారంభిస్తారు.
- 10.30 గంటలకు సభా వేదికపైకి చేరుకుంటారు. జిల్లా ప్రగతిపై కలెక్టర్ గౌతమి ప్రసంగిస్తారు. అనంతరం రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి అవుతారు. అనంతరం ఖరీఫ్–2022కు సంబంధించిన వైఎస్సార్ ఉచిత పంటల బీమా మెగా చెక్కును విడుదల చేస్తారు.
- 12.05 గంటలకు సభా ప్రాంగణం నుంచి సీఎం రోడ్డు మార్గాన హెలిప్యాడ్‌కు బయల్దేరుతారు.
- 12.15కు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.15 నుంచి 12.45 వరకు స్థానిక నాయకులతో సమావేశమవుతారు.
- 12.55 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయకు వెళతారు.

క్లుప్తంగా

విధుల్లోకి తాగునీటి కార్మికులు



గేట్‌వాల్వ్ తెరుస్తున్న కార్మికులు

కూడేరు: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5 నుంచి సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మెబాట పట్టారు. అయితే కలెక్టర్ గౌతమి చొరవతో శుక్రవారం సాయంత్రం సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 165 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. తాగునీటి కార్మిక యూనియన్ నేతలుతో, ప్రజా సంఘాల నేతలతో స్వయంగా కలెక్టర్ తన బంగ్లాలో శుక్రవారం చర్చలు జరిపినట్లు యూనియన్ నేతలు తిప్పయ్య, శ్రీనివాసులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని , విధుల్లోకి వెళ్లాలని స్పష్టమైన హామీ ఇవ్వడంతో కార్మికులమంతా విధుల్లో చేరినట్లు వారు తెలిపారు.

అల్లు అర్జున్ సందడి



ఎగువపల్లి గెస్ట్‌హౌస్ వద్ద అల్లుఅర్జున్

గార్లదిన్నె: మండల పరిధిలోని ఎగువపల్లి సమీపంలో44వ జాతీయ రహదారి పక్కన ముంటిమడుగు కేశవరెడ్డి గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం సినీహీరో అల్లు అర్జున్ సందడి చేశారు. అల్లు అర్జున్ హైదరాబాద్ నుంచి తన స్నేహితులతో కలసి బెంగళూరుకు వెళ్తూ గార్లదిన్నె మండలం ఎగువపల్లి సమీపంలో గెస్ట్‌హౌస్ వద్ద వాహనాలు ఆపి భోజనం చేసి కొంతసేపు విరామం తీసుకున్నారు. తర్వాత అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లారు. కొందరు అభిమానులు గెస్ట్‌హౌస్ వద్దకు వెళ్లి అల్లుఅర్జున్‌తో ఫొటోలు దిగారు.

జోరుగా .. హుషారుగా..







ఫొటోలు: డి.మహబూబ్ బాషా, అనంతపురం

గార్లదిన్నె మండలం కోటంక పొలాల్లో పుచ్చకాయ పంటలో ఒంటెద్దు సేద్యం చేస్తున్న రైతు, నాగిరెడ్డిపల్లి పంట పొలంలో చీనీ చెట్లకు జీవామృతం అందిస్తున్న రైతులు, వేరుశనగ పంట వేసేందుకు భూమిని చదును చేస్తున్న నరసనాయనికుంట రైతు

రైతు బాంధవుడు వైఎస్సార్

- వైఎస్ హయాంలో 'అనంత' రైతు ఇంట పండుగలా వ్యవ'సాయం'
- రూ.71 కోట్ల కరెంటు బిల్లులు మాఫీ
- ఉచిత విద్యుత్‌కు రూ.150 కోట్లు
- ఐదేళ్లలో రూ.1138 కోట్ల బీమా పరిహారం
- ఒకే విడత కింద రూ.555 కోట్ల రుణమాఫీ



అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయం దండగ.. ఉచిత విద్యుత్ ఇస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసు వాల్సిందే.. వ్యవసాయానికి సబ్సిడీలు, రాయితీలు వృథా అంటూ రైతులను చిన్నచూపు చూశారు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు. దీనికి తోడు ప్రకృతి కరుణ లేక 1995 నుంచి 2003 వరకు కరువు కరాళ నృత్యం చేయడంతో 'అనంత' రైతులు పొట్టచేత పట్టుకొని వలస బాట పట్టారు. సరిగ్గా అలాంటి సమయంలోనే నేనున్నానంటూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశాకిరణమయ్యారు. ప్రజాప్రస్థానం పాదయాత్రలో ప్రజల కష్టాలు కళ్లారా చూసిన ఆయన అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని పండుగలా చేశారు. రైతును రాజుగా చేసిన వైఎస్సార్ జయంతి (జూలై 8)ని రైతు దినోత్సవంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా నిర్వహిస్తూ ఆ మహనీయున్ని స్మరిస్తోంది.

బీమాతో ధీమా..

చంద్రబాబు హయాంలో లోపభూయిష్టంగా ఉన్న పంటల బీమాలో సమూలంగా మార్పు చేసి రైతులకు భరోసా ఇచ్చారు. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించారు. 2004–2009 మధ్య వైఎస్ హయాంలో వేరుశనగ రైతులకు పంటల బీమా కింద ఏకంగా రూ.1138 కోట్లు పరిహారం ఇచ్చారు. పంటకోత ఫలితాల ఆధారంగా పెద్ద ఎత్తున బీమా ఇవ్వడంతో అప్పట్లో రైతులు పండుగ చేసుకున్నారు. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద మరో రూ.100 కోట్లు ఇచ్చారు.

ఉచిత కరెంటుతో ఊపిరి..



2004లో ముఖ్యమంత్రిగా దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వేదికపైనే ఉచిత కరెంటు ఫైల్‌పైనే తొలిసంతకం చేసి వ్యవసాయానికి ఊపిరిపోశారు. చంద్రబాబు హయాంలో పెద్ద ఎత్తున పేరుకు పోయిన విద్యుత్ బిల్లులు మాఫీ అన్నదాతకు అండగా నిలిచారు. అలా జిల్లా రైతులకు చెందిన రూ.70.65 కోట్లు విద్యుత్ బిల్లులు మాఫీ అయ్యాయి. ఐదేళ్లలో 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ.150 కోట్లు విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. వైఎస్ హయాంలో పంట రుణాల పంపిణీ రూ.6,594 కోట్లకు చేర్చారు. సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు పావలా వడ్డీ కింద ఐదేళ్లలో 12 లక్షల అకౌంట్లకు రూ.44 కోట్లు అందజేశారు.

అనుబంధ రంగాలకు పెద్దపీట..

ఒక్క వ్యవసాయానికే పరిమితం కాకుండా అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్ల తోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూతను అందించడంతో ఈ రంగాలు కూడా గాడినపడ్డాయి. రూ.25 కోట్లు ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీరవిప్లవానికి నాంది పలికారు. రూ.80 కోట్లు మేర సబ్సిడీ ఇవ్వడంతో 40 వేల హెక్టార్ల విస్తీర్ణంలో కొత్తగా పండ్లతోటలు విస్తరించాయి. రైతులకు బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఎస్సీ ఎస్టీలకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో సూక్ష్మసేద్యాన్ని భారీగా విస్తరించారు. వైఎస్ ఆరేళ్లకాలంలో రూ.280 కోట్లు బడ్జెట్ ఇవ్వడంతో కొత్తగా 1.13 లక్షల హెక్టార్లకు సరిపడా డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేశారు. మొత్తమ్మీద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి ఏకంగా రూ.13 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు నివేదికలు చెబుతున్నాయి.

రుణమాఫీతో అండ..

2008లో కరువు పరిస్థితులు ఉండటంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వైఎస్సార్ ప్రభుత్వం రుణమాఫీ చేసింది. 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్లు రుణాలు ఒకేవిడతలో మాఫీ చేశారు. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన వారికి ప్రోత్సాహకాల కింద 3,61,269 మంది రైతులకు రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందజేశారు. మొత్తమ్మీద రుణమాఫీ కింద 6,65,206 మంది రైతులకు రూ.625 కోట్ల లబ్ధిచేకూరింది.

రాయితీ విత్తనాలతో లబ్ధి..

ఏటా ఖరీఫ్, రబీలో రైతులు ఇబ్బంది పడకుండా లక్షల క్వింటాళ్ల వేరుశనగ, పప్పుశనగ, కంది, ఇతర విత్తనాలు రాయితీతో ఇచ్చారు. 2004 నుంచి 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్లు వేరుశనగ పంపిణీ చేశారు. కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు.

వైఎస్సార్‌ను మరువలేం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులెవరూ మరువలేరు. ఆయన పాలనలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. పంటలు పండాయి. పండకపోయినా నష్టపరిహారం ఇచ్చి ఆదుకుని కరువు కాటకాలను గట్టెక్కించిన గొప్ప నాయకుడు. అనుకున్న సమయానికి రాయితీతో విత్తనాలు, ఎరువులు, డ్రిప్ పరికరాలు ఇచ్చారు. తండ్రికి తగ్గ తనయుడుగా ఇప్పుడు వైఎస్ జగన్ ఇంకా ఎక్కువగానే మంచి కార్యక్రమాలు చేస్తున్నారు.

– గొంచికారి కరియన్న, కైరేవు, శెట్టూరు.

అన్నదాతకు జగన్ సర్కారు వెన్నుదన్ను

- నాలుగేళ్లలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద ఉమ్మడి జిల్లాకు రూ.1,855 కోట్లు విడుదల
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా చీనీ, దానిమ్మ, ద్రాక్ష, టమాట పంటలకూ బీమా
- చంద్రబాబు హయాంలో 2014–18 మధ్య ఇచ్చిన బీమా రూ.714 కోట్లే
- అందులోనూ ప్రీమియం రూపంలో రైతుల నుంచి రూ.326 కోట్ల వసూళ్లు.

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అన్నదాతకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామగ్రామాన ఆర్‌బీకే వ్యవస్థను ప్రవేశపెట్టి వ్యవసాయ సేవలను రైతు ముంగిటకు తీసుకొచ్చింది. విత్తు మొదలు పంటల విక్రయం వరకు తోడుగా ఉండి వ్యవసాయాన్ని పండుగలా చేసింది. పంటలు పండకపోయినా 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'తో. 'నేనున్నా' అంటూ ముఖ్యమంత్రి జగన్ రైతులకు ధీమా కల్పిస్తున్నారు. రైతులపై ప్రీమియం భారం పడకుండా ఖరీఫ్, రబీలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేస్తున్నారు. ఈ–క్రాప్ డేటా, ఆన్‌లైన్ వెదర్ డేటా, పంట కోత ప్రయోగాల ఫలితాల ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకూ పంటల బీమా కింద సాయం అందిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పరిహారమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఈ నాలుగేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 11.21 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,855 కోట్ల బీమా పరిహారం ఇవ్వడం విశేషం. దీంతో పాటు ప్రీమియం రూపంలో జిల్లా రైతులకు ఏటా రూ.120 కోట్ల వరకు మిగులుబాటు అవుతోంది. ఈ లెక్కన నాలుగేళ్లలో ప్రీమియం రూ.480 కోట్లు ఆదా అయ్యింది. ఇది కూడా కలుపుకుంటే జిల్లా రైతులకు రూ.2,335 కోట్ల వరకు లబ్ధి చేకూర్చారు. ప్రధానంగా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా చీనీ, దానిమ్మ, ద్రాక్ష, మిరప, టమాట, అరటి లాంటి పంటలకు బీమా వర్తింపజేశారు. చంద్రబాబు హయాం (2014–2018)లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఐదేళ్లలో 10.95 లక్షల మంది రైతులకు గాను రూ.714.07 కోట్ల పంటల బీమా పరిహారం ఇచ్చారు. అందులో రైతుల నుంచే ప్రీమియం రూపంలో రూ.325.91 కోట్లు పిండుకున్నారు. అంటే ప్రీమియం పోనూ వాస్తవంగా చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చింది రూ.388 కోట్లు మాత్రమే కావడం విశేషం.

చంద్రబాబు హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు పంటల బీమా ఇలా..

సంవత్సరం	కట్టిన ప్రీమియం రూ.కోట్లలో	వచ్చిన పరిహారం రూ.కోట్లలో	రైతుల సంఖ్య
2014 -15	14.09	25.61	47,627
2015-16	115.06	109.66	1,85,194
2016-17	44.64	419.10	5,07,658
2017-18	72.10	159.70	3,10,115
2018-19	80.02	--	--
మొత్తం	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594 మంది

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు పంటల బీమా

సంవత్సరం	లబ్ధి పొందిన రైతుల సంఖ్య	వచ్చిన పరిహారం రూ.కోట్లలో
2019-20	2,46,649	266.42
2020-21	2,05,291	362.25
2021-22	4,04,461	855.55
2022-23	2,65,114	370.58
మొత్తం	11,21,515	రూ.1,854.80 కోట్లు

ఏర్పాట్ల పరిశీలన..

కళ్యాణదుర్గం: సీఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, జేసీ నిషాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, కళ్యాణదుర్గం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రైతులకు నేడు పెద్ద పండుగ రోజన్నారు. రైతు దినోత్సవం రోజున పంటల బీమా పరిహారం సొమ్ము సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా విడుదల చేయడం గొప్ప విషయమన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.





వేదికను పరిశీలిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, కళ్యాణదుర్గం పార్టీ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి

- సీఎం పర్యటన సందర్భంగా శుక్రవారం అధికారులు సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. హెలిప్యాడ్ వద్ద నుంచి బహిరంగ సభ ప్రాంగణం వద్ద వరకు పారపాట్లకు తావు లేకుండా ఉండేలా అధికారులు అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకున్నారు.
- సీఎం జగన్ రాకతో కళ్యాణదుర్గం నూతన శోభ సంతరించుకుంది. హెలిప్యాడ్ వద్ద నుంచి సభా ప్రాంగణం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పటిష్ట బందోబస్తు..

కళ్యాణదుర్గం: సీఎం పర్యటనకు పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. హెలిప్యాడ్ వద్ద నుంచి సభా స్థలం వరకు, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు, 144 మంది ఎస్ఐలు, 357 మంది పోలీసులు, 119 మంది మహిళా పోలీసులు, 200 మంది హోంగార్డులు, 200 మంది స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తారు.

ఉరవకొండకు చేనేత క్లస్టర్ మంజూరు

- మాట నిలుపుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఉరవకొండకు చేనేత క్లస్టర్‌ను మంజూరు చేయించారు. చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు ఉరవకొండకు రూ1.64 కోట్లతో పెన్నోబిలేశ్వర బ్లాక్ లెవెల్ చేనేత క్లస్టర్‌ను మంజూరు చేశారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర జౌళిశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 8 చేనేత క్లస్టర్‌లను మంజూరు చేయగా, అనంతపురం జిల్లాకు సంబంధించి ఉరవకొండకు ఒక చేనేత క్లస్టర్ మంజూరైంది. మొదటి విడతగా రూ.60 లక్షల నిధులు కూడా మంజురు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో పెన్నోబిళేశ్వర చేనేత క్లస్టర్ ద్వారా 320 మంది చేనేత కుటుంబాలకు ప్రత్యక్షంగా జీవనాధారం దొరకనుందన్నారు. ఆధునిక డిజైన్లు, సాంకేతిక శిక్షణ, ఆధునీకరణ మగ్గాలు, జాకార్డు యంత్రాలు, లిఫ్టింగ్ జాకార్డు, షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో 12 గంటల సోదాలు

- అరకిలో బంగారం, కిలో వెండి స్వాధీనం
- రూ.6.75 లక్షల నగదు, విలువైన ఆస్తుల పత్రాలు కూడా..

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ అనంతపురం అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి అక్రమాలను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిగ్గుతేల్చారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు రామ్‌నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేసిన విషయం విదితమే. శుక్రవారం మరో అధికారుల బృందం సబ్‌రిజిస్ట్రార్ నివాసముంటున్న అరవిందనగర్‌లోని శ్రీవిష్కల రెసిడెన్సీ ఐదో అంతస్తు 502వ ఫ్లాట్‌లో సోదాలు చేపట్టింది. ఆ సమయంలో సబ్‌రిజిస్ట్రార్ భార్య శ్రీదేవి, కుమార్తె ఇంట్లో ఉన్నారు. దాదాపు 12 గంటలపాటు సోదాలు జరిగాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. ఇంట్లో రహస్య ప్రదేశంలో దాచిన అరకిలో బంగారు నగలతో పాటు కిలో వెండి వస్తువులను, రూ.6.75 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సబ్‌రిజిస్ట్రార్‌కు అనంతపురంలో ఓ అధునాతన ఫ్లాట్‌తో పాటు గుంతకల్లు, పామిడి ప్రాంతాల్లో భూములున్నాయని, వాటి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.



సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి నివాసం

మూడు రోజులుగా నిఘా: సబ్‌రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తిపై ఏసీబీ అధికారులు మూడు రోజులుగా నిఘా పెట్టినట్లు తెలిసింది. అందులో భాగంగా సబ్‌రిజిస్ట్రార్ కదలికలపై ఆరా తీసిన అధికారులు పథకం ప్రకారం దాడి చేశారు. సబ్‌రిజిస్ట్రార్ దంపతుల బంధువులు, వారి కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉంటున్న వారిపై దృష్టి పెట్టినట్లు సమాచారం. వీరి ఇళ్లపై కూడా సోదాలు జరిపే అవకాశాలున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి

రాప్తాడురూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి తెలిపారు. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు సచివాలయంలో శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీతో పాటు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వై.పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి మాట్లాడారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఉప సర్పంచ్ చెన్నయ్య, సచివాలయ కన్వీనర్లు రవీంద్రరెడ్డి, సుధాకర్, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ చలపతి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జురె డ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నా రు.

ఆహార భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి

అనంతపురం క్రైం: ఆహార పదార్థాలు విక్రయించే హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు విధిగా ఆహార భద్రత నియమాలు పాటించాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో ఆహార పదార్థాల తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గడువు తీరిన ఆహార పదార్థాలను ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదని, ఎప్పటికప్పుడు చేసి వాటినే ప్రజలకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీం, శిక్షకురాలు యశోద, కేవీజియం ప్రతినిధులు సింధు, మోహన్‌బాబు, బాబయ్య పాల్గొన్నారు.

నవ్య ఆవిష్కరణలతోనే నూతన సమాజం

అనంతపురం: నవ్య ఆవిష్కరణలతోనే నూతన సమాజం సాధ్యమని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేషన్స్ కోచ్ నవీన్ లక్నూర్ అన్నారు. శుక్రవారం అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్, స్టార్టప్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆవిష్కరణలపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్స్ కౌన్సిల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం ఎస్‌జీ స్మిత , ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తిరావు, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సురేంద్రనాయుడు పాల్గొన్నారు.


పేదల పక్షపాతి వైఎస్సార్



కేక్ కట్ చేస్తున్న విద్యార్థి నాయకులు

అనంతపురం రూరల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి భాగం నగర అధ్యక్షుడు మారుతి ప్రకాష్, నవీన్, విజయ్, అసిఫ్, కార్తీక్, వసీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి



డ్రైవర్‌పై దాడి చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువుకట్ట వద్ద శుక్రవారం ఆర్టీసీ డ్రైవర్ హుస్సేన్, కండక్టర్ వినయ్‌కుమార్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. వివరాలు.. అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులు, సురేష్ బైక్‌పై గుత్తి నుంచి అబ్బేదొడ్డికి బయలుదేరారు. అయితే చెరువుకట్ట వద్దకు రాగానే లారీ రావడంతో ఆర్టీసీ డ్రైవర్ బస్సును పక్కకు తిప్పాడు. ఈ సమయంలో బస్సు తమకు తగిలి ఉంటే తమ పరిస్థితి ఏంటంటూ రామాంజనేయులు, సురేష్ డ్రైవర్, కండక్టర్లపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: పేదల అభ్యున్నతే ప్రభుత్వ పరమావధి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, అంబేద్కర్ నగర్‌లలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వ సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు.

సదరం సర్టిఫికెట్ల అందజేతకు చర్యలు..

ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న కాస్ట్, ఇన్‌కం, ఆధార్ మొబైల్ లింక్, తదితర మొత్తం 11 సేవలతో పాటు మిగితా సదరం, మ్యారేజ్, తదితర సమస్యలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. రిజిష్టర్ చేసిన సమస్య సీఎం లాగిన్‌కు వెళ్తుందని, నెలాఖరులోపు అందుకు పరిష్కారం లభిస్తుందన్నారు. సదరం క్యాంపులకు సంబంధించి వికలాంగ ధ్రువీకరణ పత్రం మంజూరుకు నెలల సమయం పడుతోందని, క్యాంపులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు త్వరలో నాలుగైదు సదరం క్యాంపులను ఏర్పాటు చేసి అక్కడే సర్టిఫికెట్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

రూ.800 కోట్లతో నగరాభివృద్ధి:

గత ప్రభుత్వం కంటే భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యేఅన్నారు. రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో నాలుగైదు నెలల్లో పనులన్నీ పూర్తి చేసి నగరం రూపురేఖలు మార్చేస్తామన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సావిత్రి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు జయలలిత, కొండ్రెడ్డి రాధ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

రైతు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీనివాసనగర్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. 2022 ఖరీఫ్‌కు సంబంధించి వివిధ పంటల బీమా కింద అనంతపురం జిల్లాకు రూ.211.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను రైతు దినోత్సవం సందర్భంగా సీఎం నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.7 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ పాలనలో జరిగిన రైతు ఆత్మహత్యలపై ఆ పార్టీకి బాకా ఊదే పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఒకసారి వాటిని తిరిగేసుకోవాలన్నారు. ఏనాడైనా అన్నదాతల గురించి ఆలోచించారా..?..: 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు ఏనాడైనా అన్నదాతల గురించి ఆలోచించారా? అని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ హయాంలో ఫారంపాండ్ల పేరుతో రూ.వందల కోట్ల దోపిడీ జరిగిందన్నారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడు కరువు కాటకాలతో రైతులు నరకం చూశారని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.5 లక్షలను మృతుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అందజేశారు. ఇటీవల హనుమాన్ కాలనీకి చెందిన వడ్డే సంగప్ప అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా మృతుడి కుటుంబానికి మంజూరైంది. దీంతో శుక్రవారం మృతుడి ఇంటికి వెళ్లి, బీమా మొత్తాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ గోగుల లక్ష్మీదేవి, కన్వీనర్ రాధాకృష్ణ, నాయకులు సుహాసిని, విజయ్, నాగార్జున, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభ జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: కళ్యాణదుర్గంలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటల ఇన్సూరెన్స్ విడుదల చేయడానికి సీఎం జగనన్న కళ్యాణదుర్గం వస్తున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు అందరూ పాల్గొనాలన్నారు. నియోజకవర్గంలో పలు మండలాలకు ఇన్సూరెన్స్ కొన్ని పంటలకే వర్తింపజేశారని, ఈ విషయం సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

జగనన్న సురక్ష పక్కాగా నిర్వహించాలి..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ఉద్యోగస్తులు పక్కాగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. మండల వ్యాప్తంగా అర్హులను గుర్తించి, వారికి ఇంటి స్థలం లేకపోయినా, ఇల్లు మంజూరు కాకపోయినా వారిని గుర్తించి, వివరాలు సేకరించాలన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కరించేవిధంగా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నక్క, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, నాయకులు పెద్ద కొండారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మధు, వెంకట్రాముడు, ఫణిరెడ్డి, సోము, నాగరాజు, అతికిరెడ్డి, అంజినప్ప, బుషిరెడ్డి, వెంకటేష్, తైదుల శివారెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో నిముషాంబాదేవి



నిముషాంబాదేవి

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో ఆషాఢమాసంలో వచ్చిన శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబాదేవి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పలు కూరగాయలతో శాకంబరీ అలంకరించారు. ఐదో రోడ్డు పెద్దమ్మతల్లి, హెచ్చెల్సీకాలనీ చాముండేశ్వరి, గుత్తి రోడ్డు చౌడేశ్వరి మాత, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లు పూజలందుకున్నారు.

దళితులకు ద్రోహం చేసింది పరిటాల కుటుంబమే

- పరిటాల దౌర్జన్యాలపై దళిత సంఘం నాయకుల ఆగ్రహం



రామగిరిలో మాట్లాడుతున్న దళిత నాయకులు

రామగిరి: రామగిరి ప్రాంతంలో గతంలో నక్సలిజం, ఫ్యాక్షన్ రాజకీయాలకు దళితులను బలిపశువులుగా చేసి, రాజకీయ పబ్బం గడుపుకుంది పరిటాల కుటుంబమేనని వైఎస్సార్‌సీపీ మండల దళిత నాయకులు బండారు అనిల్‌కుమార్, సీ. ముత్యాలు, కుంటిమద్ది ఓబిలేసు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు దళిత సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు మండలం బి.యాలేరులో ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో పరిటాల కుటుంబ సభ్యులతో పాటు టీడీపీ నాయకులు అనవసరమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇందులో పరిటాల సునీత తమ స్వార్థ రాజకీయాల కోసం మరోసారి దళితులను బలిపశువులు చేయాలని చూస్తున్నారని విమర్శించారు.

40 ఏళ్లుగా దళితుల అభివృద్ధి పట్టించుకోలేదు..

పరిటాల కుటుంబ గత 40 ఏళ్లుగా దళితులు, బీసీలను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తోందని వారు విమర్శించారు. గతంలో జరిగిన నక్సల్ ఉద్యమాల్లో పరిటాల శ్రీరాములుతో పాటు చనిపోయిన హరిజన లింగన్న, బోయ రామాంజనేయులు కుటుంబాలు ఈరోజు ఆర్థికంగా అధ్వానస్థితిలో ఉంటే, పరిటాల కుటుంబం మాత్రం రూ.వేల కోట్లకు పడగలెత్తిందన్నారు. తమ రాజకీయాల కోసం దళితులను వాడుకున్న వీరు.. వారి అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. పరిటాల రవీంద్ర హయాంలో ఆర్‌ఓసీ ముసుగులో హరిభూషణ్, రవీంద్ర, వెంకటేష్‌నాయక్ లాంటి దళిత, గిరిజన నాయకులను హతమార్చింది వాస్తవం కాదా? అని పరిటాల కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. ప్రస్తుతం దళితులు మీ కుట్ర రాజకీయాలకు దూరంగా ఉన్నారన్నారు. దీనికి తోడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరంగా దళితులు, బీసీలకు అన్నింటా పెద్దపీట వేసి, అందరినీ అక్కున చేర్చుకున్నారన్నారు. దళితుల అభివృద్ధి కోసం పాటు పడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని దళిత సంఘం నాయకులు తెలిపారు. అంతకుముందు వారు సీఎం జగన్, ఎమ్మెల్యే చిత్ర పటాలతో ఊరేగింపుగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు బండారు లింగన్న, జే ముత్యాలు, కొల్లప్ప, శెట్టి ముత్యాలు, శీన పాల్గొన్నారు.

మత సామరస్యం వెల్లివిరియాలి



దర్గాలో దువా చేస్తున్న మేయర్ వసీం, నదీమ్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు

అనంతపురం సిటీ: మత సామరస్యం వెల్లివిరియాలని మేయర్ వసీం , వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఆకాంక్షించారు. తాడిపత్రి రోడ్డులో గల మొహమ్మదిస్ గుట్టపై వెలసిన హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రీ ఉరుసు శుక్రవారం రాత్రి జరిగింది. నాయకులు రహంతుల్లా, ఇషాక్, వేమల నదీమ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

అడుగడుగునా అపూర్వ ఆదరణ

నగరంలో వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమానికి వెళ్తున్న జగనన్న సైనికులు (ఆ పార్టీ ప్రతినిధులు, నేతలకు) అడుగడుగునా ఆదరణ లభిస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం చెరువు కట్ట మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పైన పేర్కొన్న కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అనుబంధం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా చెరువుకట్ట మసీదు ఖాజీ హాఫీజ్ జాహిద్ హుస్సేన్ సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, ఇషాక్, సచివాలయ కన్వీనర్ ఇమ్రాన్, ముహీబ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం చెరువు కట్ట వద్ద గల మరో మొహమ్మదివాన్ గుట్ట మసీదులోనూ కార్యక్రమం నిర్వహించారు.

'నీలికురింజి సముద్రం-ప్రగతి కవిత్వం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ట్స్‌కళాశాలలో డాక్టర్ ప్రగతి రచించిన 'నీలికురింజి సముద్రం-ప్రగతి కవిత్వం' పుస్తకావిష్కరణ శుక్రవారం ఘనంగా జరిగింది. సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాజారామ్ అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథులుగా సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ విరసం రాష్ట్ర నాయకులు పాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏసీఆర్ దివాకరరెడ్డి, పుస్తక సమీక్ష చేసిన ప్రముఖ రచయిత్రి శశికళ తదితరులు మాట్లాడారు. సీనియర్ కవులు డాక్టర్ రాధేయ, డాక్టర్ హేమమాలిని, పేరిందేవి, అరుణాంక్ లత, డాక్టర్ అంకె శ్రీనివాస్ ప్రగతి సాహిత్యాభిషపై ఆప్తవాక్యాలు పలికారు. రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, ఉప్పరపాటి వెంకటేశులు, సాహితీస్రవంతి ప్రజ్ఞాసురేష్, జనప్రియ కవి ఏలూరు యంగన్న, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

- జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన



సదస్సు ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: పూర్వ విద్యార్థులే కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్లు అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 1970 వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కళాశాలలోని ప్రతి విభాగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ కే. బాలవీరారెడ్డి విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, మాజీ ప్రొఫెసర్లు డి. సాయిబాబా రెడ్డి, డాక్టర్ వి. శంకర్ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరీక్షల విభాగంలో విద్యార్థుల హెల్ప్‌లైన్ సెంటర్ , పరీక్షల విభాగం బోర్డు రూమ్‌ను వీసీ జింకా రంగజనార్దన శుక్రవారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులకు దోహదపడేలా హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్రమోహన్ రెడ్డి, అడిషనల్ కంట్రోలర్లు, వర్సిటీ ఇంజినీర్లు అస్లాం బాషా, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

అనంతపురం క్రైం: జిల్లా పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఉదయం 7 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జనాభా నియంత్రణకు కృషి చేయండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11 నుంచి 15 రోజుల పాటు జనాభా నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కార్యక్రమాలు నిర్వహించాలని ప్రోగ్రాం ఆఫీసర్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వివిధ ప్రోగ్రాం ఆఫీసర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జనాభా నియంత్రణ, స్థిరీకరణ పద్ధతులపై ప్రజలకు నిశితంగా తెలియజేయాలన్నారు. కాపర్ టీ, గర్భ నిరోధక మాత్రలు, శాశ్వత పద్ధతుల్లో వేసక్టమీ, ట్యూబెక్టమీ పద్ధతులపై తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ మనోజ్, డాక్టర్ మహేంద్రనాథ్, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డెమో ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

'మీడియా పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నారు'

అనంతపురం క్రైం: సర్వజనాస్పత్రిలో మీడియా పేరుతో కొందరు వ్యక్తులు ఎలాంటి ప్రిస్కిప్షన్ లేకుండా సిటీ, ఎంఆర్ఐ స్కాన్‌లు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, సంతకాలు చేయకపోతే వాట్సాప్ గ్రూపుల్లో వైద్యు లు లేరంటూ పోస్టులు చేయడం, ఆర్ఎంఓ, సూపరిటెండెంట్‌కు తమపై ఫిర్యాదు చేస్తూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు వద్ద క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీఎంఓలతో సూపరింటెండెంట్ అత్యవసర సేవలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ, సీఎం, గవర్నర్‌కు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. సీఎంఓలకు ప్రైవేట్ వ్యక్తుల బెదిరింపులొస్తున్న మాట వాస్తవమేనని అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్ అన్నారు. సమావేశంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, సీనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్ అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సునీత, సీఎంఓలు డాక్టర్ జానార్దన్ నాయక్, డాక్టర్ మాధురి డాక్టర్ రజిత, డాక్టర్ రీన, డాక్టర్ పవన్, డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

72 వేల క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా 40 శాతం రాయితీతో ఇప్పటి వరకు 82 వేల మంది రైతులకు 72 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసినట్లు ఆ శాఖ జిల్లా అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగతో పాటు జనరల్ సీడ్ కింద 30 శాతం రాయితీతో కందులు, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు, అలాగే మినీకిట్ల కింద ఉచితంగా కందులు, 2,535 ప్యాకెట్లు కొర్రలు, 300 ప్యాకెట్లు రాగులు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. ఇంటర్నేషల్ మిల్లెట్ ఇయర్ నేపథ్యంలో జిల్లాలో చిరుధాన్యాల పంటల విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించామని తెలిపారు.

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ఇస్మాయిల్

అనంతపురం టౌన్: నగరంలోని రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ఇస్మాయిల్‌ను నియమిస్తూ జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. స్థలం రిజిస్ట్రేషన్ కోసం లంచం తీసుకుంటూ అక్కడ జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న సత్యనారాయణ మూర్తి పట్టుబడ్డారు. ఆయన్ను శుక్రవారం కర్నూలులోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఇస్మాయిల్‌కు జాయింట్-1కు, టీజీ రెడ్డిని జాయింట్-2కు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమించారు.

విత్తన కందులు పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో సర్పంచ్ ఎర్రిస్వామి రైతులకు కందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఎస్ఏ శోభ, పంచాయతీ సెక్రటరీ శిరీష, మాజీ సర్పంచ్ వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతి ప్రవేశాలకు కౌన్సెలింగ్

అనంతపురం రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశం కోసం మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాలు, కళాశాల జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. మెరిట్ ఆధారంగా 11, 12 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. 11న కురుగుంట గురుకుల పాఠశాలలో బాలురకు, 12న బి.పప్పూరులో బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. https://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితాను విద్యార్థులు చూసుకోవచ్చన్నారు.

క్యాజువాలిటీ పరిస్థితులను తెలియజేయండి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో క్యాజువాలిటీలో నెలకొన్న పరిస్థితులపై ఆరాతీయాలని సీనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఆదేశించారు.

ముగిసిన అండర్-15 జట్టు ఎంపిక





హాన్సీ (50 పరుగులు), రాజు కుళ్లాయిప్ప (72 పరుగులు)

అనంతపురం: జిల్లా స్థాయి క్రికెట్ బాలికల అండర్-15 టీం ఎంపిక పూర్తయినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ కే మధుఆచారి తెలిపారు. రెండు రోజుల పాటు ఎంపిక పోటీలు నిర్వహించగా, ఇందులో 34 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. రెండు టీంలుగా విభజించి, వారి జాబితా ప్రకటించారు. ప్రెసిడెంట్ లెవల్, సెక్రటరీ లెవల్ రెండు జట్లుగా విభజించి మ్యాచ్ నిర్వహించారు.

- ప్రెసిడెంట్ లెవల్ -11 జట్టు 40 ఓవర్లలో 208 పరుగులు చేశారు. కే గౌతమి 45 పరుగులు, పి. సుమియా తేజ్ -38 పరుగులు, వింధ్య భారతి -21 పరుగులు చేశారు.

ప్రెసిడెంట్-11 జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : నిత్యరెడ్డి, తేజు దీపిక, సుమియా తాజ్, గౌతమి, తేజ, అస్మిత, విద్య భారతి, రోష్నారా, హుస్నారా, వెంకి, ఛత్రిక, దారా దారా, జాహ్నవి, సమీన, మేఘన, మదనిక

- సెక్రటరీ -11 జట్టులో 40 ఓవర్లకు గాను 194 పరుగులు చేశారు. హాన్సీ 50 పరుగులు, వీసీ రివ్య -32 పరుగులు చేశారు. ప్రెసిడెంట్ లెవల్ జట్టు 14 పరుగుల తేడాతో గెలుపొందింది.

సెక్రటరీ-11 జట్టుకు ఎంపికైన క్రీడాకారులు: ఛాయశ్రీ, హాన్సీ, బృంద, రివ్య, మదనిక, పూర్ణచంద్రిక, హేమవర్షిణి, బి.నందిని, తేజశ్వణి, శారద, కీర్తన, వైష్ణవి, అంజుమ్, భారతి

డ్రాగా ముగిసిన మ్యాచ్..

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్ మల్టీ డే అంతర జిల్లా టోర్నమెంట్‌లో భాగంగా అనంతపురం- కడప, చిత్తూరు- కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రా గా ముగిసింది. తొలి బ్యాటింగ్‌లో అధిక్యత ప్రదర్శించిన అనంతపురం, కర్నూలు జట్లకు మూడు పాయింట్లు ఆధిక్యత కల్పించారు. ఈనెల 9 నుంచి మూడో రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

- అనంతపురం – కడప మ్యాచ్‌లో అనంతపురం మొదటి ఇన్నింగ్స్‌లో 359 పరుగులు చేసింది. కడప మొదటి ఇన్నింగ్స్‌లో 298 పరుగులు చేయగా, అనంతపురం రెండో ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేయగా, 7 వికెట్లు కోల్పోయి ఆలౌట్ కాకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఎం. రాజు కుళ్లాయప్ప 138 బంతుల్లో 72 పరుగులు (పది ఫోర్లు, ఒక సిక్సర్) చేసి కీలక ఇన్నింగ్స్ ఆడారు.